క్లుప్తంగా

ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డిపో మేనేజర్ ప్రశాంతి

పుత్తూరు రూరల్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రశాంతి మంగళవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇందులో ఐదుగురు డ్రైవర్లు, గ్యారేజీ, ఏసీడీలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఏడుగురు ఉన్నట్లు తెలిపారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన సిబ్బంది సైతం అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే డిపోను విజయపథంలో నడపవచ్చని అన్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో కేసీ బాబు, ఏఈ ప్రసాద్, ఎస్.కరీముల్లా, ఎం.విజయ్‌కుమార్, డి.చంద్రయ్య, ఎన్.అంకయ్య, డి.గోవిందరాజులు ఉన్నారు.

చీరల వితరణ



వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేస్తున్న దాత

కార్వేటినగరం: నాగలాపురం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న జీ.నాగరత్నం తండ్రి జీ.దామోదర్‌దాస్ జ్ఞాపకార్థం కార్వేటినగరం రాస్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చీరలు, పంచెలు వితరణ చేశారు. అలాగే పండ్లు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నాగరత్నం మాట్లాడుతూ పెంచి పెద్ద చేసి, ఉన్నత చదువులు చదివించిన తన తండ్రి దామోదర్‌దాస్ రుణం తీర్చుకోలేనిదని, ఆయన జ్ఞాపకార్థం ఏటా వృద్ధులకు చీరలు, పంచెలు వితరణ చేస్తున్నట్లు చెప్పారు.


అక్రమాలను ఉపేక్షించం



దుకాణంలో తనిఖీ చేస్తున్న రామకృష్ణ శాస్త్రి

వెదురుకుప్పం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం అమ్మకాల్లో అక్రమాలను ఉపేక్షించేది లేదని చిత్తూరు మద్యం డిపో ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ శాస్త్రి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. దుకాణాల్లో మద్యం బాక్సుల్లో ఉన్న స్టాకును పరిశీలించారు. బాటిల్ వారీగా నిల్వ ఉన్నవి, ఆన్‌లైన్ యాప్ ద్వారా నమోదైన స్టాకుపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో తనిఖీలు చేసేటప్పుడు మద్యం బాక్సుల్లో ఉన్నవి బాటిల్ టు బాటిల్ చూపించాలన్నారు. అక్రమాలు జరిగితే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మద్యం అమ్మకాలు చేపట్టాలని సూచించారు. దుకాణాల్లో పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే విధుల నుంచి తొలగించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తనిఖీ అధికారులు నాగరాజు, జాన్సన్, సూపర్‌వైజర్లు ఉన్నారు.

చందనాలంకారంలో బంగారమ్మ



కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామదేవత బంగారమ్మ మంగళవారం చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనే, నారికేళ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి, భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం



మందులు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్

వెదురుకుప్పం: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలు అందించి, పేదలకు బాసటగా నిలవడం అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మాంబేడులో తిరుపతి కార్తీక కంటి, ముక్కు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 75 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ సుదూర ప్రాంతాల్లోకి వెళ్లి రూ.వేలల్లో ఖర్చు పెట్టి వైద్యం చేసుకునే స్తోమత లేని వారికి వైద్యసేవలు అందించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు నరహరి, సునీల్, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు కేశవులు, వెంకటాచలం పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమం

- డిప్యూటీ సీఎం కే నారాయణస్వామి



బలిజకండ్రిగలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని డిప్యూటీ సీఎం కే నారాయణస్వామి తెలిపారు. మంగళవారం కృష్ణజిమ్మాపురం సచివలయాల పరిధిలోని బలిజకండ్రిగ దళితవాడ, దాసరి కాలనీ, ఇందిరానగర్, కృష్ణజిమ్మాపురం ఆదిఆంధ్రవాడ, కొల్లిరెడ్డికండ్రి, పావులూరుకండ్రిగ, కొత్త పల్లె గ్రామాల్లో ఎంపీపీ శ్యామల ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో వారు పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని రంగాలనూ అభివృద్ధి చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తాన్నామని తెలిపారు. దేశం మొత్తం గుర్తించేలా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో సుపరిపాలన అందిస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్నలగన్ వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, ఆర్బీకే చెర్మన్ పోలయ్య, నాయకులు పుత్తూరు కేశవరెడ్డి, ఇందిరమ్మ, సుందరరాజు, సుబ్రమణ్యరెడ్డి, వరదరాజు, ప్రకాష్, బాబు, మనోహర్, షణ్ముగరెడ్డి, పద్మనాభనాయుడు, రవిరెడ్డి, సర్పంచ్ భాస్కరెడ్డి, మహేష్ బాబు, తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ఐకేపీ ఏపీఎం ఫరిద్‌మస్తాన్, హౌసింగ్ డీఈ వేంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఏఈ వరదరాజు, ఎస్ఐ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమంతుకుమార్, పీఆర్ ఏఈ మునిరాజ్, హౌసింగ్ ఏఈ దాము పాల్గొన్నారు.

అంతకు ముందు డిప్యూటీ సీఎం గ్రామాల్లో ప్రజలను పలకరించగా వారు తమ సంతోషం వ్యక్తం చేశారు. ఆ ఆనందం వారి మాటల్లోనే..

సొంతింటి కల నెరవేరింది



సొంతిల్లు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే సొంతింటి కల నెరవేరింది. సంక్షేమ పథకాలు నేరుగా మా ఇంటికే చేరుతుండంతో కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేదు. గ్రామాల్లోనే సచివా లయ సిబ్బంది అదుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తున్నారు.

\- ఎస్.అనిత, కొల్లిరెడ్డికండ్రిగ

అన్నలా ఆదుకున్నారు



ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసి, జగనన్న మమ్మల్ని ఓ అన్నలా ఆదుకున్నారు. గత నాలుగేళ్లలో మా కుటుంబానికి వైఎస్సార్ రైతు భరోసా రూ.36,500, వైఎస్సార్ సున్నావడ్డీ రూ.5,951, వైఎస్సార్ ఆసరా రూ.9,274, మొత్తం రూ.1,65, 325 వచ్చింది. వలంటీర్లు ఎప్పటి కప్పుడు పథకాలును ఇంటి వద్దకే వచ్చి అందజేయడం సంతోషంగా ఉంది.

\- పుల్లారెడ్డి సౌమ్య, కొల్లిరెడ్డికండ్రిగ

గడప గడపకూ వచ్చినవారు లేరు



గతంలో ఎన్నికలు వచ్చినప్పుడు ఓట్లు కోసం ఎమ్మెల్యేలు వచ్చేవారు. ఆ తరువాత ఐదేళ్లు కనిపించేవారు కాదు. ఆ తరువాత మళ్లీ వచ్చి ప్రజల సమస్యలు అడిగేవారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అలా కాకుండా మంత్రులు, ఎమ్మెల్యేలను గడప గడపకూ పంపి ప్రజల సమస్యలను తెలుసుకుని, పరిష్కరిస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వం వైఎస్సార్ సీపీదే.

\- జీ అందాలు, కృష్ణజిమ్మాపురం

అభివృద్ధి పనుల పరిశీలన



జెండామానువీధిలో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పుత్తూరు రూరల్: పట్టణంలోని జెండామానువీధిలో జరుగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. 15 ఆర్థిక సంఘం నిధులతో ప్రతి వార్డులోనూ మౌలిక వసుతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. జెండామానువీధి, ఎక్స్‌టెన్షన్‌లోని ప్రజలు తాగునీటి కనెక్షన్ల కోసం వినతి పత్రాలు ఇస్తే మంజూరు చేస్తామని తెలిపారు. బోరుబావుల మరమ్మతుల నిమిత్తం రూ.4 లక్షల అంచనాతో జీఐ పైపులను గుత్తేదారు ద్వారా కొనుగోలు చేసినట్లు చెప్పారు. పురపాలక సంఘంలో నిరుపయోగంగా ఉన్న 20 స్టీల్ డస్ట్ బిన్స్‌ను వినియోగంలోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. పట్టణంలో అవసరమైన ప్రదేశాలను గుర్తించి అక్కడ ఏర్పాటు చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు.

పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగరాణి

వెదురుకుప్పం: పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీపీ నాగరాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ప్రతి పేద కుటుంబంలోని పిల్లలకు ఉన్నత విద్యను అందించాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తున్నట్లు చెప్పారు. నాణ్యమైన విద్యను అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ మాట్లాడుతూ విద్యే ప్రగతికి మూలాధారమని భావించి, కార్పొరేట్ స్థాయిలో పేద పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేదవాడి చదువుకు భరోసా కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రాధిక, సర్పంచ్ శిల్ప పాల్గొన్నారు.

కనుల పండువగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో ద్రౌపదీ సమేత అర్జునుడు

పుత్తూరు రూరల్: స్థానిక ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో మంగళవారం మహా కుంభాభిషేక వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పిలిస్తే పలుకుతా సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రి 7 గంటలకు అర్జున, ద్రౌపదీదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పాలతో సుందరంగా అలంకరించి ఊయలపై ఆశీనులను చేశారు. భక్తి కీర్తనల నడుమ ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, ఆలయ అర్చకుడు మోహన్ పర్యవేక్షించారు.

యాంత్రీకరణతో అధిక దిగుబడి

విజయపురం (నగరి): యాంత్రీకరణ సాగుతో అధిక దిగుబడి, ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి రజినికుమార్ అన్నారు. ఆధునాతన పద్ధతుల్లో సాగుపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ సమయం, పెట్టుబడులతో అధిక దిగుబడులను సాధించడంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలో సీఎస్ కండ్రిగ, పన్నూరు, మాధవరం, బూచివానత్తం, గంగమాంబపురం తదితర గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రసాయన ఎరువు లవాడకాన్ని తగ్గించి కూలీలతో పని లేకుండా యాంత్రీకరణ ద్వారా పంట సాగు చేసుకోవచ్చన్నారు.

ఆస్తి పత్రాల మిస్సింగ్‌పై ఫిర్యాదు

వెదురుకుప్పం: తన ఇంటి ఆస్తి మూల పత్రాల దారపోయాయని మండలంలోని పచ్చికాపల్లం గ్రామానికి చెందిన మురగారెడ్డి కుమారుడు ఎస్.గణేష్‌రెడ్డి వెదురుకుప్పం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 2వ తేదీన పచ్చికాపల్లం నుంచి వెదురుకుప్పం గ్రామానికి మోటార్ సైకిల్‌లో వెళుతుండగా మార్గమధ్యంలో 1991లో రిజిస్టర్ అయిన మూలపత్రాలు దారిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోగొట్టుకున్న ప్రాంతంలో వెతికినా దొరకలేదని తెలిపారు. న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నాడు.

నేడు గడప గడపకు మనప్రభుత్వం

పాలసముద్రం : మండలంలోని తిరుమలరాజుపురం సచివాలయం పరిధిలోని గ్రామాల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకే కార్యక్రమం ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి కే నారాయణస్వామి హాజరవుతారన్నారు. ఉద్యోగులు, వలంటీర్లు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

మొగిలీశ్వరునికి రూ 3.56లక్షల ఆదాయం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామికి హుండీల రూపేణా రూ 3,56,315 ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజులు, వంశపారం పర్య ధర్మకర్త విజయకుమార్ తెలిపారు. మంగళవారం ఆలయంలోని సాధారణ, అన్నదాన హుండీలకు సంబంధించి మూడు నెలల కానుకలను దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కించారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆహార భద్రత.. మీ బాధ్యత



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి ఎడ్యుకేషన్: సమాజంలో వ్యవసాయ రంగానిదే అగ్రస్థానమని, ఈ రంగంలో సాంకేతికత మరింత అభివృద్ధి చెంది ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ విద్యార్థులపై ఉందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత అన్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో మంగళవారం జరిగిన వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. తిరుపతి వ్యవసాయ కళాశాలకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న వారిలో పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లతో పాటు గ్రూప్-1 స్థాయి అధికారులు సమాజానికి సేవలందిస్తుండడం ఈ కళాశాలకు గర్వకారణమని తెలిపారు. మరింత మంది ప్రజా సేవకులు, రైతు సేవకులు ఈ కళాశాల నుంచి సమాజంలోకి రావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆహార పదార్థాల్లో రసాయనాలు అధిక మోతాదులో ఉన్నాయంటూ వస్తున్న హెచ్చరికల నేపథ్యంలో ప్రజా ఆరోగ్య దృష్ట్యా ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యం ఉందన్నారు. దీని కోసం శాస్త్రవేత్తలు శాస్త్రీయంగా రసాయన రహిత ఆహార ధాన్యాలు, కూరగాయలను సమాజానికి అందించేలా కృషి చేయాలని కోరారు.

-ఏఎస్పీ జె.వెంకటరావు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి వ్యవసాయ విద్యార్థులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు చేస్తున్న కృషితో నేడు వ్యవసాయ రంగంలో మనం రాణిస్తున్నామని తెలిపారు. కలుషితం లేని ఆహార ఉత్పత్తుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఆ దిశగా నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు ఫలితాలు రాబట్టాలని కోరారు. వార్షికోత్సవం సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ పి.సుధాకర్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జి.ప్రభాకర రెడ్డి, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ సి.రమణ, విద్యార్థి వ్యవహారాల అధికారి కేవీ.హరిప్రసాద్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంతో వ్యాధుల నివారణ



కీటకజనిత వ్యాధులపై అవగాహన ర్యాలీ

నగరి: పారిశుద్ధ్యం పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని జిల్లా మలేరియా అధికారి ఎల్.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కె.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ‘కీటక జనిత వ్యాధులు–నివారణ’ అనే అంశంపై నిర్వహించిన ఒరియన్‌టేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కీటక జనిత వ్యాధులు (మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికున్ గునియా, మెదడు వాపు వ్యాధి) రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యల గురించి శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు శానిటేషన్ సెక్రటరీలు, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశ వర్కర్లు, మున్సిపల్ ఫాగింగ్, స్ప్రెయింగ్ సిబ్బందికి వివరించారు. కీటకాల ద్వారా వ్యాధులు ఎలా వస్తాయో వాటిని ఎలా నివారించవచ్చో ప్రొజెక్టర్ సహాయంతో అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణలో అందరూ భాగస్వాములై నగరిని ఆదర్శంగా నిలుపుతామన్నారు. సమావేశం అనంతరం ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో పుత్తూరు మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.మోహన్ బాబు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేజీ పురుషోత్తం, పర్యవేక్షకులు హుసేనమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థుల పేర్లను నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు



విద్యాకానుక కిట్లు అందిస్తున్న కౌన్సిలర్

నగరి: ప్రభుత్వ పాఠశాలలే విద్యాబోధనలో మిన్న అని, ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం అన్ని వసతులతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఎం.కొత్తూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ప్రచారం చేశారు. మంగళవారం పాఠశాల పరిధిలోని అర్జునప్ప కండ్రిగ, బుగ్గ అగ్రహారం, వేలావడి, ఇరుగువాయి గ్రామాల్లో పర్యటించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రయోజనాలను చెప్పి విద్యార్థుల వివరాలు నమోదు చేసుకున్నారు. జగనన్న విద్యాకానుక ద్వారా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం, షూ, టై, బెల్టుతో పాటు డిక్షనరీ కూడా అందిస్తున్నామని, పాఠశాలల్లో ఉదయం రాగిజావా, మధ్యాహ్నం మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తామని వివరించారు.

విద్యాకానుక పంపిణీ

నగరి: మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో ఉన్న కాకవేడు ఆదిఆంధ్రావాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కౌన్సిలర్ మునికృష్ణారెడ్డి విద్యార్థులకు మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి. రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు



ఆరూరు ఆర్బీకే సిబ్బందితో మాట్లాడుతున్న వీరపాండియన్

నింద్ర: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని జగనన్న పథకాల ప్రత్యేక అధికారి వీర పాండియన్ అన్నారు. మంగళవారం నింద్ర మండలంలో ఆయన పర్యటించారు. తొలుత ఆరూరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. రైతులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. నింద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆపరేషన్ థియేటర్, ల్యాబ్‌ను పరిశీలించి సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని, మందులు కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. కావనూరులో రేషన్ దుకాణానికి వెళ్లారు. వచ్చే నెల నుంచి రేషన్ ద్వారా రాగులు, జొన్నలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట నగరి ఆర్డీఓ సుజన, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, నగరి ఏడీ సౌభాగ్యలక్ష్మి, తహసీల్దార్ అమరేంద్రబాబు ఉన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నగరి: మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ వార్డు వీకేఎస్ లేఅవుట్ 3వ వీధి (ఎస్సీ), 12వ వార్డు బీటీఎం వీధి (జనరల్), 24వ వార్డు అన్నామెయిన్ రోడ్డు (జనరల్ మహిళ), 25వ వార్డు గాండ్ల వీధి (జనరల్), 27వ వార్డు చింతలపట్టెడ దళితవాడ (జనరల్) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి, ఆపై విద్యార్హత కలిగి, 18 నుంచి 35 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులన్నారు. ఈ నెల 18వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 21, 22 తేదీల్లో ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. 23 తేదీలోపు ఎంపిక చేసిన వలంటీర్లకు సమాచారం అందుతుందని, 24వ తేదీ నుంచి బాధ్యతలు అప్పగిస్తామన్నారు.